ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 19 జనవరి 2024 | 5





పెద్దాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చినరాజప్ప

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, జనవరి18: మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గుర్రాల సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని జాతీయస్థాయికి తీసుకువెళ్లిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఎన్టీఆర్ గొప్ప దార్శనికుడన్నారు. అనంతరం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు రోగులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజాసూరిబాబు రాజు, తూతిక రాజు, కొరిపూరి రాజు, రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సిరివాడ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేత ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడిది శ్రీనివాస్, రాగాల ఉమా మహేశ్వరరావు, భీమలింగం బాబులు, చాగంటి బుజ్జి, తోట రామకృష్ణలు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకూ సంక్షేమ ఫలాలు

- 7లో

కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార



చిన్నారికి బాలామృతం తినిపిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్ర ముంజపార

నేటి నుంచి జిల్లాలో కుల గణన ప్రారంభం : కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, జీవనోపాధి, జనాభా అంశాలకు సంబంధించి సమగ్ర కుల ఆధారిత సమాచారాన్ని ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు సేకరించనున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కులగణనకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం జరుగుతుందన్నారు. సర్వే ద్వారా సేకరించిన డేటాను అట్టడుగువర్గాల ప్రయోజనాలకోసం, మెరుగైన ప్రణాళిక రూపకల్పనకోసం మాత్రమే వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ డేటాను ఉపయోగించి ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ పథకాలు తొలగించడం, కొత్తగా ఇవ్వడం జరగదన్నారు. అదేవిధంగా కుల ధ్రువీకరణ పత్రాల జారీకోసం పరిగణనలోకి తీసుకోరన్నారు. జనాభా, విద్య ఆర్థిక, సామాజిక వివరాలు సేకరించడమే లక్ష్యమన్నారు. వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించరని, డేటా భద్రత, డేటా గోప్యతా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో కుల గణన ప్రక్రియ విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇళ్లకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి సరైన సమాచారం అందజేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

బాబోయ్ బాదుడు!

- సంక్రాంతి సెలవులు ముగియడంతో పెరిగిన తిరుగు ప్రయాణాల రద్దీ
- ఇదే అదనుగా విమాన, బస్సు చార్జీల్లో టిక్కెట్ల ధరలు ఆకాశంలోకి
- రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ విమాన చార్జీలు రూ.10 వేలపైనే
- రోజు తిరిగే ఆరు సర్వీసులకు ఈనెల 22వరకు ఫ్లైట్ చార్జీలన్నీ రెట్టింపే
- తిరిగి ఈనెల 24 నుంచి సాధారణ చార్జీలు రూ.4,700 వసూలు
- అటు కాకినాడ నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సు చార్జీ రూ.2వేలపైనే
- ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు రూ.3 వేల వరకు బాదుడు
- సాధారణ రోజుల్లో హైదరాబాద్‌కు ఏసీ బస్సు చార్జీ రూ.900
- 21 వరకు కాకినాడ-హైదరాబాద్ రూట్లో ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్‌లు నిల్
- అటు విజయవాడ, హైదరాబాద్ వైపు వెళ్లే రైళ్లకు యమా డిమాండ్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ అంటే వివిధ వృత్తులు, వ్యాపారాల పనిపై దేశవ్యాప్తంగా ఎవరు ఎక్కడున్నా సొంతూర్లకు క్యూకడతారు. అందులోభాగంగా పండగకు జిల్లాకు వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకున్నారు. వీరిలో ఎక్కువమంది హైదరాబాద్ నుంచి వచ్చినవారే ఉన్నారు. అయితే ఇప్పుడు సంక్రాంతి సెలవులు ముగియడంతో వీరంతా తిరుగు ప్రయాణాలు చేస్తుండడంతో రద్దీ పెరిగిపోయింది. గమ్యస్థానాలకు వెళ్లాలంటే విమాన, బస్సు టిక్కెట్ చార్జీలు షాక్ కొడుతున్నాయి. రద్దీని అదనుగా చూసుకుని ఎక్కడికక్కడ చార్జీలను నిర్వాహకులు రెట్టింపు వసూలు చేస్తున్నారు. రద్దీ అధికంగా ఉన్నా గమ్యస్థానాలకు వెళ్లడం కోసం అనేకమంది చార్జీలు ఎక్కువైనా ప్రయాణిస్తున్నారు. వాస్తవానికి మంగళవారం కనుమ పండగ, బుధవారం ముక్కనుమ చేసుకున్నారు. ఈనేపథ్యంలో పండగ సెలవులు పూర్తి చేసుకుని గురువారం నుంచి తిరుగు ప్రయాణాలు మొదలుపెట్టారు. ఒకపక్క స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినా హైదరాబాద్, బెంగళూరుల్లో వివిధ ఆఫీసులు, కంపెనీలు, మాల్స్‌లో పనిచేసే జిల్లావాసులు గురువారం తిరుగు ప్రయాణాలు మొదలుపెట్టారు. ఫలితంగా ఎక్కడికక్కడ రద్దీ పెరిగిపోయింది. ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు వెళ్లేవారికి టిక్కెట్లు దొరకడం లేదు. అటు రద్దీ ఎక్కువగా ఉండడంతో విమాన చార్జీలు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రోజూ ఇండిగో ఆరు సర్వీసులు నడుపుతోంది. సాధారణ రోజుల్లో ఈ రూట్లో టిక్కెట్ ధర రూ.4 వేల వరకు ఉంటోంది. ఇప్పుడు రద్దీ నేపథ్యంలో టిక్కెట్ రూ.10వేల వరకు పిండేస్తున్నారు. శుక్రవారం టిక్కెట్లు అయితే అత్యధికంగా రూ.10,336 పలుకుతోంది. ఈనెల 20న ఉదయం ధర రూ.7,606, సాయంత్రం రూ.9,706 ఉంది. ఈనెల 21న కూడా టిక్కెట్ చార్జీలు రూ.9,800 వరకు ఉన్నాయి. తిరిగి ఈనెల 24 నుంచి సాధారణ చార్జీలే ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరుకు డైరెక్ట్ విమాన చార్జీలు సాధారణ రోజుల్లో రూ.5,348కాగా, శుక్రవారం ఏకంగా రూ.14,570 వరకు పిండేస్తున్నారు. మరో రెండు రోజుల వరకు కూడా రూ.8 వేల నుంచి రూ.11వేల మధ్య ధరలు కొనసాగుతున్నాయి. జిల్లా నుంచి ఎక్కువమంది బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వీరంతా తిరుగు ప్రయాణానికి నానా తంటాలు పడుతున్నారు.





సంక్రాంతి పండగ ముగియడంతో సొంతూర్ల నుంచి జనాల తిరుగు ప్రయాణాల రద్దీ మొదలైంది. దీంతో ఎక్కడికక్కడ రవాణా చార్జీలు భారీగా పెరిగిపోయాయి. విమానాల టిక్కెట్ల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ వరకు ఇదే అదనుగా భారీగా డబ్బులు పిండేస్తున్నాయి. సాధారణ రోజు చార్జీలకంటే రెట్టింపు రేటు వసూలు చేస్తున్నాయి. అటు ప్రయాణీకుల రద్దీ పెరగడంతో టిక్కెట్లు కూడా దొరకడం లేదు. దీంతో ఏదోలా గమ్యస్థానానికి చేరుకోవడం కోసం కొందరు రెట్టింపు చార్జీలు చెల్లించి ప్రయాణిస్తున్నారు. వాస్తవానికి కనుమ పండగ మంగళవారంతో ముగిసినా బుధవారం ముక్కనుమ కావడంతో చాలామంది తిరుగు ప్రయాణాలు చేయలేదు. తిరిగి గురువారం నుంచి ప్రయాణాలు మొదలుపెట్టడంతో పండగ రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో చార్జీలన్నీ రెట్టింపయ్యాయి. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమాన చార్జీలు సాధారణ రోజుల్లో రూ.4 వేల వరకు ఉంటే ప్రస్తుతం రూ.10 వేల వరకు వసూలుచేస్తున్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు ఏసీ బస్సు చార్జీలు రూ. వెయ్యి వరకు ఉంటే ఇప్పుడు రూ.2 వేల వరకు పిండేస్తున్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం వరకు ఒక్క టిక్కెట్ కూడా లేకుండా సోల్డ్‌అవుట్ అయిపోయాయి. అటు రైళ్లు సైతం కిక్కిరిసిపోయాయి.

కాకినాడ బస్ కాంప్లెక్స్‌లో గురువారం తిరుగు ప్రయాణికుల రద్దీ



ప్రైవేటు ట్రావెల్స్ మరీనూ...

కాకినాడ నుంచి హైదరాబాద్‌కు, ఆ చివర అన్నవరం నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సులు సాధారణ రోజుల్లో ఏసీ బస్సులు రూ.900 వరకు టిక్కెట్ చార్జీలు వసూలు చేస్తాయి. కానీ పండగ రద్దీ నేపథ్యంలో అనేక ప్రైవేటు ట్రావెల్స్ రూ.2,200 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్ బస్సులు అయితే ఏకంగా రూ.3 వేల వరకు పిండేస్తున్నాయి. విమాన చార్జీలు అధికంగా ఉండడం, రైళ్లలో బెర్తులు ఖాళీ లేకపోవడంతో అనేకమంది ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు రెట్టింపు బాదేస్తున్నారు. చేసేది లేక అనేకమంది జేబులు గుల్ల చేసుకుని తిరుగు ప్రయాణాలు చేస్తున్నారు. అనేక వెబ్‌సైట్లు అయితే సీట్లు ఫుల్ అని చూపిస్తున్నాయి. వాస్తవానికి సాధారణ రోజుల్లో కాకినాడ నుంచి హైదరాబాద్, బెంగళూరుకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను బాగా కుదించేశారు. కానీ సంక్రాంతి రద్దీ నేపథ్యంలో 40 వరకు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవన్నీ ఇప్పుడు చార్జీలు పిండేస్తున్నాయి. తిరిగి సోమవారం నుంచి ఏసీ బస్సు టిక్కెట్లు రూ.900 వరకు వసూలు చేస్తున్నారు. కాకినాడ నుంచి బెంగళూరుకు రోజూ ఆరు సర్వీసులు ఉండగా, ఇవి కూడా రూ.2 వేల వరకు టిక్కెట్ ధర వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఈ రూట్లో రూ.1300కే టిక్కెట్ దొరుకుతోంది. అటు ఆర్టీసీ కాకినాడ నుంచి హైదరాబాద్‌కు నడిపే సర్వీసులు కూడా టిక్కెట్లు ఫుల్ అయిపోయాయి. శుక్రవారం కాకినాడ నుంచి హైదరాబాద్‌కు ఉన్న తొమ్మిది సర్వీసుల్లో ఒక్క టిక్కెట్ కూడా లేదు. ఈ నెల 20న ఒక్క బస్సులో ఒక సీటు మినహా మిగిలిన ఎనిమిది సర్వీసులు సోల్డ్ అవుట్ చూపిస్తున్నాయి.



రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న చంద్రమౌళి

చంద్రమౌళి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సామర్లకోట, జనవరి18: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాన్ని సామర్లకోట మఠంసెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప, రంగనాగ్ తదితర నాయకులు ఘన నివాళులర్పించారు. అలాగే మండలంలోని వేట్లపాలెం గ్రామంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ నాయకుడు గుణ్ణం చంద్రమౌళి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి విశేష కృషిచేసిన ఎన్టీఆర్ చిరస్మరణీయులన్నారు. అలాగే గ్రామంలో మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంగమేశ్వరావు, బేతిన రాజు, గోలి వీరభద్రరావు పాల్గొన్నారు. అలాగే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 104 మంది యువత రక్తదానం చేయగా, రక్తదాతలకు ప్రశంసాపత్రాలను చంద్రమౌళి అందజేశారు. కార్యక్రమాల్లో రిత్విక్ డాక్టర్ కామరాజు, డాక్టర్ దుర్గదాసు, డాక్టర్ కిషోర్, డాక్టర్ మోహన్, కొండపల్లి కృష్ణమూర్తి, గోలి వెంకట్రావు, గోలి శ్రీరామ్, కమ్మిల సుబ్బారావు, అడబాల చిట్టిబాబు, పారిశ్రామికవేత్త గుమ్మళ్ల రాజు పాల్గొన్నారు.



లబ్ధిదారులైన మహిళలకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్

జిల్లాలో 15,966 మందికి రూ.కోటి 93 లక్షల లబ్ధి

ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చెక్కు పంపిణీ చేసిన కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి18: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ పథకం కింద జిల్లాలో 15,966 మందికి రూ.కోటి 93 లక్షల 67 వేల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో తొలి దఫా వడ్డీ రాయితీని గురువారం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తాడేపల్లి నుంచి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా.. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లాలోని లబ్ధిదారులతో కలిసి స్థానిక కలెక్టరేట్ సమావేశ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం నమూనా చెక్ అందజేశారు. ఇంకా గృహ నిర్మాణ సంస్థ ఎస్ఈ వై.శ్రీనివాసరావు, మెప్మా పీడీ బి.ప్రియంవద పాల్గొన్నారు.



జయహో బీసీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్

నేటి నుంచి జిల్లాలో జయహో బీసీ పర్యటనలు

ప్రత్యేక ప్రచార వాహనాలను ప్రారంభించిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్

కాకినాడ సిటీ, జనవరి18: బీసీల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా కార్యాచరణ చేపట్టేందుకు జిల్లాలో ఈనెల 19 నుంచి జయహో బీసీ పర్యటనలు జరుగనున్నాయని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ వెల్లడించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద జయహో బీసీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కట్టుబడిన పార్టీ టీడీపీ అని, ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు చంద్రబాబు బీసీల సంక్షేమానికి అనేక విధాలుగా పాటుపడ్డారన్నారు. జయహో బీసీ వాహనాలను పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాలను పంపించనున్నామన్నారు. తొలుత దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొన్నవోలు తన పదవికి రాజీనామా చేసి.. విమర్శలు చేయాలి

కాకినాడ సిటీ, జనవరి 18 : అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరి ప్రతిపక్ష నేతపై విమర్శలు చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రతిపక్ష నేతపై విమర్శలు చేయడం అధికార దుర్వినియోగం అవుతుందన్నారు. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ప్రత్తిపాడు మండలంలో పట్టుబడిన నిందితులు, మద్యం బాటిళ్లు

‘బెల్టు’ జోరు!

- కొన్ని గ్రామాల్లో రెండు నుంచి మూడు షాపుల ఏర్పాటు
- ప్రభుత్వ దుకాణాల నుంచి తెచ్చి విక్రయాలు
- బాటిల్‌కు రూ. 20 నుంచి రూ.50 వరకూ అదనంగా వసూలు
- మద్యం షాపుల వద్ద రాత్రి వేళల్లో సిబ్బంది అమ్మకాలు
- చోద్యంచూస్తున్న ఎస్ఈబీ అధికారులు

జిల్లాలో మద్యం ఏరులైపారుతోంది. దశలవారీగా మద్య నిషేధం పేరుతో దుకాణాలను ప్రభుత్వమే నడుపుతూ ఆదాయ వనరుగా మార్చుకుంటోంది. ఎప్పుడు ఎక్కడ కావాలంటే అక్కడ లిక్కర్‌ను అందుబాటులో ఉంచుతోంది. దుకాణాల సంఖ్యను తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. పెద్దాపురం ఎస్ఈబీ కార్యాలయం పరిధిలో బెల్టు షాపులు, నాటుసారా జోరు అధికంగా ఉంది. ఎస్ఈబీ అధికారులు వీటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలం అయ్యారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.

మద్యం, సారా స్వాధీనం

ప్రత్తిపాడు, జనవరి18: ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, వెంకటనగరం, ధర్మవరం, ఇ.గోకవరం గ్రామాల్లో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని తుట్ట సత్యనారాయణనుపై కేసు నమోదు చేశారు. అలాగే ఒమ్మంగిలో 10 లీటర్ల సారాతో కుక్కల గన్నెమ్మను, ధర్మవరంలో 25 మద్యంబాటిళ్లతో బుద్ధ నూకరాజును, వెంకటనగరంలో 10 బీరు సీసాలతో కుసుమంచి నానాజీలను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సీఐ పి.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట, జనవరి18: మామిడాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసున్నామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

పెద్దాపురం, జనవరి18: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడిక్కడ బెల్టు దుకాణాలు వెలిశాయి. కొన్ని గ్రామాల్లో రెండు నుంచి మూడు దుకాణాలు వరకూ ఏర్పాటయ్యాయి. ప్రధానంగా బెల్టు షాపుల నిర్వాహకులకు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరుకు సరఫరా అవుతోంది. అందులో పనిచేసే కొందరు సిబ్బంది రాత్రి సమయాల్లో దుకాణం నుంచి సరుకు బెల్టు దుకాణాలకు రహస్యంగా చేరవేస్తున్నారు. కొంతమంది సమీప పట్టణంలో ఉన్న దుకాణాల వద్ద నిత్యం కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. బెల్టు షాపుల్లో క్వార్టర్ రూ.200 ఉంటే దానిని మందుబాబుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకూ పెంచి అమ్ముతూ మద్యం ప్రియుల జేబులకు చిల్లు పెడుతున్నారు. దీని వెనుక ప్రభుత్వ మద్యం విక్రయ కేంద్రాల నిర్వాహకుల సహకారం పూర్తిగా ఉంది.

బడ్డీ కొట్టులోనూ మద్యం విక్రయాలు

చాలాచోట్ల బడ్డీ కొట్లు సైతం బార్లుగా మారిపోయాయి. అర్ధరాత్రి వేళ సిట్టింగులు కొనసాగుతున్నాయి. గత కొంతకాలంగా బెల్టు దుకాణాల కారణంగా తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని కలెక్టర్‌కు పెద్దాపురం మండలం నుంచి పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఎక్కడపడితే అక్కడ విక్రయాలు చేయడం వల్ల మద్యం సేవించిన మందుబాబులు గొడవలకు దిగుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా మద్యం సేవిస్తుండడంతో రాత్రి వేళల్లో ప్రయాణం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

బార్లను తలపిస్తున్న దాబాలు

కొన్నిచోట్ల దాబాలు మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. పలు ప్రాంతాల్లో అక్కడే అమ్మకాలు జరుగుతున్నాయి. గతంలో దాబా హోటళ్లలో సిట్టింగులు అరికట్టిన పోలీసులు వీటిపై దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దాబా హోటళ్ల నిర్వాహకుల నుంచి నెలవారీగా మామూళ్లు పుచ్చుకుని మిన్నకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అరకొర కేసులకే ఎస్ఈబీ అధికారులు పరిమితం

మద్యం ప్రభుత్వ దుకాణాల్లో మాత్రమే విక్రయించాలి. కానీ ప్రస్తుతం ఏ బడ్డీ కొట్టు దగ్గరకు వెళ్లినా దొరుకుతోంది. అయినప్పటికీ ఎస్ఈబీ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నెలలో అరకొరగా కేసులు నమోదు చేసి చేతుల దులిపేసుకుంటున్నారు. అవికూడా చిన్నచిన్న కేసులే నమోదు చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో మద్యం విక్రయించే వారితోపాటు సరఫరా చేసిన యజమానిపైనా కేసును నమోదు చేసేవారు. అయితే ఇప్పుడు బెల్టు దుకాణాలను కట్టడి చేయాలంటే మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పనిలో పనిగా కొందరు మామూళ్లు పుచ్చుకుని జేబులు నింపుకుంటున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి నెలవారీగా ఎస్ఈబీ, పోలీసు అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లు అందుతున్నట్టు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమలుకాని నిబంధనలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనలు అమలుకావడం లేదు. తొలుత చెప్పినట్టు ఒక్కొక్కరికీ మూడు బాటిళ్ల మాత్రమే విక్రయాలు విక్రయించాలి. కానీ అలా జరగడం లేదు. 18 సంవత్సరాలు నిండనివారికి మద్యం అమ్మకూడదన్న నిబంధనలు ఉన్నా వారికీ విక్రయించేస్తున్నారు. గతంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సమయం నిర్ధేశించగా ప్రభుత్వం మళ్లీ తొమ్మిదికి పెంచింది. మద్యం విక్రయాలను ఆన్‌లైన్ విధానంలో చేపట్టాల్సి ఉండగా ఎక్కడా అమలు జరగడంలేదు.



కోనపాపపేట మెయిన్ రోడ్డులో ఆందోళన చేపట్టిన మత్స్యకారులు

పైప్‌లైన్ నిర్మాణంతో మత్స్యకారుల ఉపాధికి ఆటంకం

కోనపాపపేటలో నష్టపరిహారం కోరుతూ ఆందోళన

కోనపాపపేట(కొత్తపల్లి) జనవరి18: రసాయన పరిశ్రమల నిర్మాణంలో ఏర్పాటుచేసే పైప్‌లైన్ల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, ఉపాధి కోల్పోతున్న కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోనపాపపేటకు చెందిన మత్స్యకారులు మెయిన్‌రోడ్డుపై గురువారం ఆందోళన చేపట్టారు. తొండంగి మండలం చోడిపల్లిపేట తీరప్రాంతం వరకు పైప్‌లైన్ బాధితులకు నష్టపరిహారం చెల్లించారని, చోడిపల్లిపేటకు దగ్గర్లో ఉన్న కోనపాపపేటకు కూడా నష్టపరిహారం చెల్లించాలని గతంలో ఆందోళన చేపట్టామని మత్స్యకారుల నాయకులు కంబాల దాసుబాబు, పల్లేటి బాపన్నదొర, కొర్ని వెంకటరమణ చెప్పారు. తమ కులానికి చెందిన ప్రజాప్రతినిధి నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చి ఆరు నెలలు కావస్తోందని.. నేటికీ నష్టపరిహారం మాట ఎత్తకపోవడంతో తిరిగి మళ్లీ ఉద్యమం చేపట్టామన్నారు. కోనపాపపేటలో సుమారు 1500 మత్స్యకారుకు గుర్తింపుకార్డులున్నాయని, వారందరికీ తొండంగి మండలంలో నష్టపరిహారం చెల్లించిన మాదిరిగా తమకూ చెల్లించాలని, లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కాగా కోనపాపపేట మెయిన్‌రోడ్డుపై ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో పిఠాపురం సీఐ శ్రీనివాసరావు చర్చించారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు మత్స్యకారులకు వివరించారు. ఈ ఆందోళనలో గంపల తాతారావు, సూరాడ శ్రీనివాసరావు, ఉమ్మిడి అప్పారావు, అర్జిల్లి నాగేశ్వరరావు, పలువురు గ్రామస్తులు ఆందోళనలో పాల్గొన్నారు.




తుని పరిసర ప్రాంతంలో దట్టంగా కమ్ముకున్న మంచు

మంచు కురిసే వేళలో..

తుని రూరల్, జనవరి 18: దట్టంగా కురుస్తున్న పొగ మంచు రహదారులను కమ్మేస్తోంది. వాహనదారులకు రోడ్లు కనపడడం లేదు. ఉదయం ఎనిమిది దాటినా మంచు కురుస్తూనే ఉంది. వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తుని పరిసర ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తున్న దృశ్యాలు కనువిందు చేశాయి.

కన్యాకుమారి వరకు యాత్ర

కడియం, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌కు చెందిన నితిన్‌చౌదరి, ప్యూస్‌చౌదరి హిందూ ప్రచారానికి ప్రాధాన్యమిస్తూ చేపట్టిన యాత్ర గురువారం కడియం చేరుకుంది. మధుర ప్రాంతం నుంచి గత ఏడాది 20వ తేదీన మోటారుసైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నాటికి కన్యాకుమారికి చేరుకుంటామని వారు తెలిపారు. దేశంలో ఏఏ దేవాలయాలు ఉన్నాయి? ఆయా ప్రాంతాల్లో భక్తి భావాలు ఎలా ఉంటాయి? అనే వాటికి ప్రాధాన్యమిస్తూ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కన్యాకుమారి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ ఉత్తరప్రదేశ్ చేరుకుంటామన్నారు. విశాఖపట్నం, కాకినాడ మీదుగా కడియం చేరుకున్నామని, రాజమండ్రి, ఏలూరు మీదుగా విజయవాడ వెళతామన్నారు. బీటీఏ చదువుకున్న వీరిద్దరూ ఈ యాత్ర అనంతరం రాముడు పయనించిన అయోధ్య నుంచి శ్రీలంక వరకు యాత్ర చేపడతామన్నారు.



కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ అడ్డుకుంటున్నారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



దీక్ష చేస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 : కోడికత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. కోడికత్తి శ్రీను వైజాగ్ జైలులో చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువారం ఆయన సంఘీభావ దీక్ష చేశారు. ఐదేళ్ల నుంచి 307 సెక్షన్ కేసు మీద కోడికత్తి శ్రీను జైలులో మగ్గుతున్నాడన్నారు. కనీసం అతనికి కోర్టులు బెయిల్ మంజూరు చేయడం లేదన్నారు. 307 కేసులో విచారణ జరపకుండా ఇంత కాలం బెయిల్ ఇవ్వకుండా ఉండడం అనేది స్వాతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే మొట్టమొదటి కేసు అని అన్నారు. ఇది చంపాలని చేసింది కాదన్నారు. దీని వల్ల జగన్ లాభం పొందుతాడని శ్రీను ఈ పని చేశాడన్నారు. దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఎన్ఐఏ చెప్పిందన్నారు. అయినా శ్రీనుకు బెయిల్ ఇవ్వలేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ఆలోచన చేయాలన్నారు. ఎంత అధికారం ఉంటే మాత్రం ఇలా బెయిల్ రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. జగన్ వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోతే వెంటనే ఆయనకు ఎన్‌బీడబ్ల్యూ ఇచ్చి కోర్టుకు రప్పించాలన్నారు. రాకపోతే వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిజంగా జగన్‌కు క్షమాగుణం ఉంటే కోర్టుకు రావాలన్నారు. కోడికత్తి శ్రీను కుటుంబం చాలా ఇబ్బందుల్లో ఉందని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కందుల దుర్గేష్‌కు పరామర్శ



దుర్గేష్‌ను పరామర్శిస్తున్న నాదెండ్ల మనోహర్



దుర్గేష్‌తో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. సతీవియోగంతో బాధపడుతున్న దుర్గేష్‌ను జేఎన్ రోడ్డులోని నివాసంలో గురువారం కలిశారు. ఉషారాణి చిత్రపటానికి నివాళులర్పించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, బొల్లినేని హస్పటల్ వైద్యుడు రామరాజు, రామ్మోహనరావు, చవ్వాకుల కుమార్ తదితరులు పరామర్శించారు.

పోలీసులపై అసత్య ఆరోపణలు తగవు

పెద్దాపురం, జనవరి 18 : పోలీసులపై లేనిపోని ఆరోపణలు తగవని డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె గురువారం మాట్లాడారు. రాజులపూడి ఆరుద్ర అనే మహిళ ఇటీవల పోలీసులపై చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఆరుద్ర తన ఇంటిని విక్రయించే విషయంలో ఆరోపణలు చేసిన కానిస్టేబుళ్లు మెరపల వీరవెంకట సత్యనారాయణ అలియాస్ శివ, మెరపల నాగకన్నయ్యతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అయిన ముత్యాలరావు, న్యాయవాది చిట్టిబాబుపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసును సైతం నమోదు చేశామన్నారు. ఆరుద్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను విచారణకు నియమించామన్నారు. అలాగే దర్యాప్తు తుది దశలో ఉన్న కారణంగా నివేదికను ఉన్నతాధికారులకు అందించన తర్వాత వారి ఆదేశాల మేరకు సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

రామచంద్రపురం, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం ప్రధాన రహదారి ప్రాఫిట్ షూమార్ట్ ఎదురుగా బుధవారం రాత్రి మారుతి 800 కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న విద్యుత్‌నగర్‌కు చెందిన రాంబాబు, ఆయన ఇద్దరు పిల్లలు ఏటీఎం నుంచి డ్రా చేసిన రూ.లక్ష నగదుతో బయటకు వచ్చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలను పట్టణ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. రాత్రి వేళ ప్రధాన రహదారిలో ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



మారుమూల ప్రాంతాలకూ సంక్షేమ ఫలాలు

కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార

పిఠాపురం రూరల్, జనవరి 18: కేంద్రం అమలు చేస్తున్న పథకాల సంక్షేమ ఫలాలు మారుమూల ప్రాంత ప్రజలకు చేరాలన్నదే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2047 నాటికి ప్రపంచంలో అభివృద్ధిలో దేశం అగ్రగామిగా ఉండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా 12 కోట్ల కుటుంబాలు రూ.5 లక్షల మేర ఆరోగ్య ప్రయోజనాన్ని పొందుతున్నాయని తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలోని 26 వేల ప్రభుత్వ, 4,692 ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చునని చెప్పారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా దారిద్ర్యరేఖను దిగువన ఉన్న 5.12 కోట్లు మహిళలకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం ద్వారా ప్రతి వ్యక్తికి అయిదు కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో గర్భిణిలు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేస్తున్నామని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందిస్తున్నామని వివరించారు. ప్రతి పథకంలోని లక్ష్యాలు, పురోగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం బాలామృతం ద్వారా చిన్నారులకు ఆహారాన్ని అందించగా, ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టరు ఇలాక్కియ, వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీపీవో కె.భారతిసౌజన్య, కందరాడ సర్పంచ్ నాగభారతి, బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు చిలకూరి రామకుమార్, గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్ర ముంజపార

సందేశాత్మకంగా సాగిన నాటికలు

భోగాపురంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు

పిఠాపురం , జనవరి 18: కుటుంబ సంబంధ బాంధవ్యాల గొప్పతనాన్ని చాటి చెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు రెండో రోజు సందేశాత్మకంగా సాగాయి. ఒకే కడుపున పుట్టిన అన్నచెల్లెలు మధ్య ప్రేమ, అనుబంధం గురించి తెలియచెబుతూ గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. నేటి ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న విలువల నేపథ్యంలో ఇలాంటి బంధాలు ఎంత అవసరమో తెలియజెప్పారు. కష్టకాలంలో చెల్లికి అండగా ఉండే అన్న, వారి కుటుంబాన్ని చక్కదిద్దిన వైనం గురించి నాటిక ద్వారా వివరించారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు.

పెళ్లంటే సర్దుబాటు, సంసారమంటూ దిద్దుబాటు అనే విషయాన్ని వివరిస్తూ గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన నాన్నా..నేనొచ్చేస్తా నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు తమ పిల్లలుకు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చేస్తూ వారిపై మితిమీరిన మమకారాన్ని వాత్సల్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీని పలితంగా పెళ్లయిన తర్వాత తమ వైవాహిక బంధంలో వచ్చే చిన్న సమస్యలనే పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లైన కూతురు నాన్నా నేనొచ్చేస్తా అనే మాటకు స్వస్తి పలికి నాన్నా మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు అనే పరిస్థితి రావాలని ఈ నాటిక ద్వారా సందేశాన్ని ఇచ్చారు. గంటి రాజేశ్వరి మూల కథను రాయగా, తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేయగా, అమృత లహరి దర్శకత్వం వహించారు. నాటికల ప్రదర్శన ఏర్పాట్లను కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పర్యవేక్షించారు.



అమృతహస్తం నాటికలో ఓ దృశ్యం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, జనవరి 18: ప్రస్తుత విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్కరణలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు సూచించారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్)డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ రీఫార్మ్స్, ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రసాదరాజు, రీసోర్స్ పర్సన్‌గా బెంగళూరులోని జేవీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ రీసెర్చ్ డీన్ ఎన్ఎంకే భట్టా, హైదరాబాద్‌లోని నార్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అడ్మిషన్స్ విభాగాధిపతి బి.పాండురంగారావు, అతిథులుగా రిజిస్ట్రార్ ఎల్.సుమలత పాల్గొనగా ముఖ్యఅతిథి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఓడీయల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపకులుగా వినూత్న ఆవిష్కరణలు చేపట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించాలన్నారు. ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ విద్యార్థి దశలో వారికి లభించే అవకాశాల గురించి చాలా మందికి తెలియదని వాటిని తెలుసుకుని అందిపుచ్చుకోగలిగితే విజయం దానంతటదే వస్తుందన్నారు. అనంతరం పాండురంగారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉన్నత విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణభాస్కర్, జేవీఆర్ మూర్తి, విభాగాధిపతులు, విశ్వవిద్యాలయ, అనుబంధకళాశాలల నుంచి అధ్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

2 లక్షల మందితో రా కదలిరా సభ

జన సమీకరణపై టీడీపీ నేతల చర్చలు

మండపేట, జనవరి 18: మండపేటలో ఈ నెల 20న జరిగే టీడీపీ రా కదలిరా బహిరంగ సభకు కోనసీమ జిల్లాల్లోని 7 నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది హాజరయ్యే విధంగా టీడీపీ నేతలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం మండపేట పట్టణంలో బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్‌లో పార్లమెంట్ పరిధిలో గల టీడీపీ ఇన్‌చార్జులతో టీడీపీ సీనియర్ నేతలు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం నియోజకవర్గాల వారీగా జన సమీకరణకు సంబంధించి వివరాలు వెల్లడించారు. రాజోలు, గన్నవరం, అమలాపురం, కొత్తపేట నుంచి వచ్చే వాహనాలను ఆలమూరు రోడ్డులో పార్కింగ్ చేసేలా స్థలాన్ని కేటాయించారు. ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట నుంచి వచ్చే వాహనాలకు చంద్రబాబునాయుడు సభాస్థలికి కూతవేటు దూరంలో పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. చంద్రబాబు నాయుడు మండపేట ఆలమూరు బైపాస్‌రోడ్డులో పరిధిలో ఉన్న ఏడిద రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగిన తర్వాత ఆయన నేరుగా బైపాస్ రోడ్డు నుంచి సభస్థలికి చేరుకునేలా రూట్ ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

సత్యదేవుని సన్నిధిలో సర్వర్ సమస్య

కొద్దిసేపు నిలిచిపోయిన వ్రతం, దర్శనం టిక్కెట్ల విక్రయాలు

అన్నవరం, జనవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో గురువారం సర్వర్ సమస్యతో కొద్దిసేపు వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమస్య తీవ్రతరం కాకుండా టిమ్స్ ద్వారా టిక్కెట్లు జారీ చేశారు. మధ్యాహ్నానికి సర్వర్‌లు యథావిధిగా పనిచేయడంతో సేవలు కొనసాగించారు. అయితే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం కోసం విజయవాడలో నెలకొన్న సమస్య మాత్రమేనని ఇక్కడ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. కొద్దిసేపటికి అంతా మామూలైందని ఈ సందర్భంగా తెలిపారు.

భార్యే హంతకురాలు

● ప్రియుడితో కలిసి హత్య చేసిన వైనం ● ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు

పిఠాపురం రూరల్, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడలో సంచలనం కలిగించిన హత్య కేసు మిస్టరీ వీడింది. ఓ వ్యక్తి హత్యకు కారణమైన అతని భార్యతో సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పిఠాపురం సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. విరవాడ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న సిద్ధాంతపు చినఅప్పారావు 10వ తేదీ రాత్రి హత్యకు గురయ్యాడు. దీంతో అతని సోదరి దాకే మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని ఇటుక బట్టీల్లో పనిచేసే సమయంలో చినఅప్పారావు భార్య తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు చిన్నారి, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నురుకుర్తి సురేష్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో మూడేళ్ల క్రితం అప్పారావు తన కుటుంబాన్ని తీసుకుని విరవాడ ఇటుకల బట్టీలో పనికి చేరాడు. అయినప్పటికి చిన్నారి, సురేష్‌ల మధ్య సంబంధం కొనసాగడంతో అప్పారావు, అతడి భార్య చిన్నారి మధ్య పలుమార్లు వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో అప్పారావును అడ్డు తొలగించుకుని ఎక్కడికయినా పారిపోవాలని చిన్నారి,సురేష్ నిర్ణయించుకుని హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇరువురు కత్తితో అప్పారావును విచక్షణారహితంగా నరికి హత్య చేసినట్లు విచారణలో వెల్లడయిందని తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేసి కత్తి, రక్తపు మరకల దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇకపై గుంటూరు వరకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, జనవరి 18: విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగిస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలును గుంటూరు వరకూ పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారి సమాచారాన్ని విడుదల చేశారు 22701, 22702 నంబర్లతో ఈ ఎక్స్‌ప్రెస్ రైలు సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాలలో రాకపోకలు సాగిస్తుంది. 22702 నంబరు గల గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరులో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి విజయవాడకు 5.15 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి రాత్రి 7.28కి చేరుకుని సామర్లకోటకు 8.18కి చేరుతుంది. తునికి 9.04కి చేరుకుని అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్నానికి రాత్రి 10.55కి చేరుతుంది.

22701 నంబరు గల విశాఖ -గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో తెల్లవారుజామున 5.20 గంటలకు బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి మీదుగా తునికి ఉదయం 6.59కి చేరుతుంది. సామర్లకోటకు 7.48కి చేరుకుని రాజమండ్రికి 8.33కి చేరుతుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా గుంటూరుకు మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్లలో సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి తెలిపారు. ఇదిలా ఉండగా 17481 నంబరు గల బిలాస్‌పూర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20,23,27లలో రద్దు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు.

17482 నంబరు గల తిరుపతి-బిలాస్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21,25 తేదీలలో రద్దు చేశారు. 17243 నంబరు గల గుంటూరు-రాయగడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 19 నుంచి 26 వరకూ విజయనగరం వరకే నడుస్తుందని తెలిపారు. 17244 నంబరు గల రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి 27 వరకూ విజయనగరం-గుంటూరు మధ్య మాత్రమే నడుస్తుంది.

చలి మంట అంటుకుని

గిరిజనుడి మృతి



ఎటపాక, జనవరి 18: ప్రమాదవశాత్తు చలి మంట అంటుకుని గిరిజనుడు మృతి చెందాడు. ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ, బండారుగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాదకర సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కుడియం కన్నయ్య (45) రోజు మాదిరిగానే మంచం పక్కన చలిమంట రాజేసి, నిద్రిస్తుండగా కప్పుకున్న దుప్పటి ప్రమాదవశాత్తు చలిమంటపై పడి కన్నయ్యకు నిప్పంటుకుంది. కొద్దిసేపటికి తేరుకుని కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున కన్నయ్య మృతి చెందాడు. ఎస్ఐ కర్రి పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య



రావులపాలెం, జనవరి 18: సాగు కోసం చేసిన అప్పులతో మనస్తాపంతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన పింద్ర రామకృష్ణ (గాంధీ) (76) కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అల్లుడు చనిపోవడంతో కుమార్తె, ఆమె పిల్లలు ఈయనతోనే ఉన్నారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో పెద్ద కుమారుడు ఇంటి వద్దనే ఉంటున్నాడు. తండ్రి, కుమారులు కలిసి పంట సాగు చేసేందుకు అప్పులు చేశారు. ఇటీవల కాలంలో వ్యవసాయం కలిసిరాకపోవడంతో రామకృష్ణ మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రామకృష్ణ మృతిపై పింద్ర లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అంజనేయులు చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పిఠాపురం, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురంలోని బైపాస్‌రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. కత్తులగూడెం ప్రాంతంలో నివాసముంటున్న జోగా త్రిమూర్తులు(70) మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా బైపాస్ విరవాడ జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో త్రిమూర్తులు తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పిఠాపురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

» ఎన్టీఆర్‌కు టీడీపీ శ్రేణుల ఘన నివాళి
» వర్ధంతి సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రత్తిపాడు, జనవరి 18: ధర్మవరంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వాడపాలెం సూర్య ఆర్కెస్ట్రా బృందం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. యువతీ, యువకులు పలు సినీ గేయాలకు చేసి నృత్యాలు అలరించాయి. ఈ ప్రదర్శనకు నగదు సహకారం అందించిన వారికి గౌరీశంకర్ల ఉత్సవ కమిటీ సభ్యులు కిల్లాడి బాబ్జీ, గొర్ల మాణిక్యం, గొనగాల రామకృష్ణ, కోనేటి రాజబాబు, దాడి శ్రీను సత్కారం చేశారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం ఎన్టీఆర్


కాకినాడలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కొండబాబు, టీడీపీ నాయకులు


జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జ్యోతుల నెహ్రూ


సర్పవరం జంక్షన్: అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసు


తుని రూరల్: కొత్తపేట సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న యనమల కృష్ణుడు

కాకినాడ సిటీ, జనవరి 18: రాజకీయాల్లో విప్లవాత్మక, చారిత్రాత్మక మార్పులు తెచ్చి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన సాహసోపేతుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం అని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా కొండబాబు ఆధ్వర్యంలో గురువారంలో నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జీజీహెచ్ సెంటర్ నందమూరి బసవ తారకం బస్ షెల్టర్ వద్ద ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. శాంతినగర్‌లో సీకోటి అప్పలకొండ ఆధ్వర్యాన పేదలకు చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. సినిమారోడ్ సంతచెరువు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వుండవల్లి వీర్రాజు, సీకోటి అప్పలకొండ, పలివెల రవి, గుత్తుల రమణ, నల్లూరి శ్రీనివాస్, కొల్లాబత్తుల అప్పారావు, ఎండీ అన్సర్, గాది శివ, వాసిరెడ్డి చిట్టిబాబు, మెంటా రావు జిలాని, చింతలపూడి రవి, అమలకంటి బలరాం, రెడ్డం సత్తిబాబు, గెడ్డం పూర్ణ, అభిమానులు ఉన్నారు.

కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొబ్బిలి గోవిందు, దవులూరి భద్రరావు, ముమ్మిడి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దమార్కెట్ ఏరియాలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి పద్మకుమారి అతిథులుగా పాల్గొని మహిళలకు చీరలు, దుప్పట్లు, 5 కేజీల రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ జనార్దన్ కేరేజ్ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కుర్ర ప్రశాంత్ చౌదరి, పల్లపోతు వెంగళరావు, మండపాక నాగబాబు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: సర్పవరం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పవరంజంక్షన్‌లో మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. చికెన్ బిర్యానీతో ఆహారం పంపిణీ చేశారు. పార్టీ నాయకులు అడపా ప్రకాశ్‌నాయుడు, రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న, కొల్లాబత్తుల అప్పారావు, కాకరపల్లి చలపతిరావు, భీమాబత్తుల సత్యనారాయణ, పలివెల త్రిమూర్తులు పాల్గొన్నారు.

పండూరులో మాజీ సర్పంచ్ బావిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగర పంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, నాయకులు పడాల ఏసువెంకటరమణ, గుళ్ల బాబ్జి, గండే నాగేశ్వరరావు, కడారి సత్యనారాయణ ఉన్నారు.

కరప: కరపలోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొర్రిపూడి, వేళంగిలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, అట్ల గోవిందరాజు, కంటే సత్తిబాబు, గండి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి బజ్జి, కాకరపల్లి బుజ్జి, పార్టీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: కొత్త పేట సెంటర్, గొల్ల అప్పారావు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తుని టీడీపీ పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, పోల్నాటి శేషగిరి, మోతుకూరి వెంకటేష్, గాది వరహాల బాబు, మళ్ల గణేష్, బాలాజీ ఉన్నారు. వి.కొత్తూరు ప్రధాన కూడలిలో టీడీపీ నేత సుర్ల లోవ రాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ తమరాన రామకృష్ణ, రొంగల అబ్బు, బోజంగి నరేష్, కిల్లి శ్రీను ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దాపర్తి సీతారామయ్య, రేఖ బుల్లిరాజు, వేములకొండ జోగారావు, పైడిపాల సూరిబాబు, పిలా మహేష్, వైభోగుల కొండబాబు యాదవ్, కురుమల్ల నాగేశ్వరరావు, నేదురి గణేష్‌బాబు, సాంబత్తుల చంద్రశేఖర్, రాజేష్, బద్ది సురేష్, డేగల సత్తిబాబు, పలివెల ఏసురాజు, నాండ్ల చిరంజీవి, తుమ్మల కిషోర్, ముత్యాల సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ పాల్గొన్నారు. పద్మానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిరంజీవి, కోరాడ బాబూరావు, కొప్పు శ్రీను, కోరాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో గండేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురారి, తాళ్లూరు, యల్లమిల్లి, మల్లేపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. యలమాటి కాశీ, బొల్లం రెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు, ఆళ్ళ సత్తిబాబు, సుంకవిల్లి రాజు, వెంకన్నదొర, పైణ్ణి వెంకటేశ్వరరావు, దాపర్తి సీతారామయ్య, చింతపల్లి భద్రరావు, గ్రంధి నాగబాబు, సుంకవిల్లి సత్యనారాయణ, వీరబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా 94 మంది రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, కౌన్సెలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, సూది బూరయ్య, గొల్లపల్లి బుజ్జి, బసవ ప్రసాద్, వైభోగుల సుబ్బారావు, కనకారావు పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు మిరియాల శ్రీను, ఏకా సత్యనారాయణ, పి.వెంకట్రావు, బి.సత్తిబాబు.. పెద్దనాపల్లిలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరంలో మాజీ సర్పంచ్ పైలా సత్యనారాయణ, కాకినాడ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణ మాజీ అధ్యక్షుడు సచివాత రాజేశ్వరరావు, పైలా అయ్యప్ప, సిడగం కన్నారావు, కోట్ల కృష్ణ, ఆర్.చిన్న, ముచ్చి అప్పలరాజు,చింతల బాణాలు,రొట్ట వీర్రాజు తదితరులున్నారు.

పిఠాపురం: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంతో పాటు ఉప్పాడ బస్టాండు, ఇందిరానగర్, మిరపకాయల వీధి తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాలు, కొత్తపల్లి మండలానికి చెందిన నాయకులు ఉన్నారు.

పెదపూడి: గండ్రేడులో టీడీపీ మహిళా నాయకులు జుత్తుక సూర్యకుమారి, మండలాధ్యక్షుడు జుత్తుక కృష్ణ, నాయకులు చాట్రాతి హరినాదరావు, గంటా రాజు, పెదపూడిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పుట్టా గంగాధర చౌదరి, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, నాయకులు ఆరుమిల్లి అమ్మన్నచౌదరి, దోమాడలో కాకర గోవిందు, మద్దుకూరి దొరబ్బాయి, కరకుదురులో సానా శ్రీను, దత్తుడు, రామేశ్వరంలో కొటికలపూడి సత్తిబాబు, చిర్రా వరప్రసాదరావు, అన్యం వెంకన్న, పబ్బినీడి హేమశంకర్, శహపురంలో మెర్ల ప్రభాకర చౌదరి, టేకుమూడి రాంబాబు, చింతపల్లిలో పైణ్ణి బాబు, చిరట్ల సూరిబాబు, ఏపీత్రయంలో ఆరుమిల్లి ప్రసాద్ చౌదరి, పెండెం అప్పన్న, పైనలో మట్టపర్తి వీర భద్రరావు, రాజు, జీ.మామిడాడలో తమలంపూడి శివరామారెడ్డి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ తోటపేట కమ్యూనిటీహాల్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రామసమాఖ్య మాజీ అధ్యక్షురాష్ల దున్నా సాయమ్మ, సాదనాల కోటేశ్వరి, టీడీపీ మహిళామణులు ఇంత సత్యనారాయణమ్మ, పూడా రెడ్డమ్మ నివాళర్పించారు. టీడీపీ నేతలు పూడా వెంకటరామకృష్ణ, సాదనాల శివరామకృష్ణ నివాళులర్పించారు. తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ నేతలు రేవు గోవరాజు, జనిపల్లి ఈశ్వరరావు, పూడా సత్యవతి, గోడి సుబ్బలక్ష్మి, రేవు సత్యనారాయణ ఉన్నారు.

రౌతులపూడి: మార్కెట్ సెంటర్ నందు ఎన్టీఆర్ విగ్రహానికి సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఎంపీటీసీలు సో మరౌతు రవి, బీజా రాజు, పసగడుగుల రమణ, జెట్లా రాజా, ఈగల సత్తిబాబు, రాంబాబు, తిరుమల దొర ఉన్నారు.

కోటనందూరు: టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు కేపీ.మల్లవరంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. మండల గ్రామాల్లోనూ నిర్వహించి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. షేక్ నవాబ్‌జానీ, పోతల సూరిబాబు, అంకంరెడ్డి రమేష్, డి.చిరంజీవిరాజు, బైలపూడి శ్రీరాంమూర్తి, పెనుమర్తి నాగేశ్వరరావు, గెడ్డం కొండయ్యదొర, రుత్తల శ్రీనివాస్, లెక్కలభాస్కర్ పాల్గొన్నారు.

శంఖవరం: టీడీపీ నేత పర్వత సురేష్, మండలాధ్యక్షుడు బద్ది రామారావు శంఖవరం, నెల్లిపూడి, వజ్రకూటం గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి సుభాష్, బద్ది రమణ, ఉల్లి వీరభద్రరావు, ఓలేటి లక్ష్మీనారాయణ, బొర్రా వాసు, బొర్రా ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్ది రామకృష్ణ, ములికి వెంకన్న తదితరులు ఉన్నారు.

కిర్లంపూడి: జగపతినగరంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు స్వగృహం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి సత్తిబాబు, సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చి నబాబు, ఆళ్ళ నానాజీ, ఆడారి నానాజీ, ఆళ్ళ వెంకటేష్, సూరిబాబు, చిన్న నివాళులర్పించారు. బూరుగుపూడిలో కుంచే తాతాజీ ఆధ్వర్యంలో కుంచే శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పారంశెట్టి రవి, కొండ్రాజులు.. పాలెంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు అల్లు శివబాబు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జి పారంశెట్టి మురళీకృష్ణ. సోమవరంలో మంచికట్ల శ్రీను, గంగిరెడ్ల దొరబాబు.. గెద్దనాపల్లిలో మాజీ సర్పంచ్ బోడిశెట్టి వెంకట శివ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

తొండంగి: ఏ.కొత్తపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏవీనగరం, శృంగవృక్షం, బెండపూడి తదితరగ్రామాల్లో వర్ధంతిని నిర్వహించారు.

అన్నవరం: రైల్వేస్టేషన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదుబాబు, రాయి శ్రీను, కోళ్ల సూరిబాబు, పల్లా గోవింద్ ఉన్నారు.


కరపలో నివాళులర్పించిన పిల్లి అనంతలక్ష్మి



ప్రత్తిపాడు: ఎన్టీఆర్ చిత్రపటానికి సత్యప్రభ నివాళి


కోటనందూరు: నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

25న జాతీయ ఓటర్ల దినోత్సవం : కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ) జనవరి 18: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు కాకినాడ సిటీ నియోజకవర్గం ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏఈఆర్వోలు, వివిధ వర్గాల ప్రజాప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటు విలువను ప్రజలకు తెలియజెప్పడం, ఓటుహక్కును వినియోగించుకోవడం వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అంశాల ప్రాధాన్యత తెలియజెప్పేలా వ్యాసరచన, వక్తృత్వం, షార్ట్‌ఫిలిమ్ పోటీలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. 25న వివేకానంద పార్కు నుంచి పీఆర్ కాలేజ్ వరకు ఓటర్‌వాక్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పీఆర్ కాలేజీలో జాతీయ ఓటర్ల దినోత్సవంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు సీతాపతిరావు, వరహాలయ్య, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు, మురళికృష్ణ, మేనేజర్ కర్రి సత్యనారాయణ, సీపీఆర్వో మానేకృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాకినాడలో శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న కులగణన పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. స్మార్‌సిటీ కార్యాలయంలో గురువారం కులగణనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు అడ్మిన్‌సెక్రటరీలు, ఎడ్యుకేషనల్ డేటా ప్రోసెసింగ్ సెక్రటరీలు హాజరయ్యారు.

'సైకో పాలనకు ముగింపు పలకాలి'

కరప, జనవరి 18: రాష్ట్రంలో సైకో పాలనకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 38రోజులుగా ఆందోళన చేస్తున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబులు పేర్కొన్నారు. కరప తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న దీక్షా శిబిరాన్ని గురువారం వారు సందర్శించి ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు. కాకినారూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకులు ఎస్.వరలక్ష్మి, ఎం.భవానీ, బి.ఆశరత్నం, ఆర్.దైవకుమారి, టీడీపీ నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి, కోటగిరి మహేంద్రబాబు, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, గంటా వీరన్నచౌదరి, కంటే సత్తిబాబు, బొజ్జా భవానీ సాంబశివరావు, చీపురపల్లి జయేంద్రబాబు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రత్తిపాడు, జనవరి 18: కనీస వేతనాలు ఇవ్వాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ప్రత్తిపాడు, ఏలేశ్వరంలో గురువారం 38వ రోజు కొనసాగింది. 2 మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేసి రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీలు ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులకు వివరణ ఇచ్చారు.

తాళ్లరేవు: తాళ్లరేవులో 38రోజు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. ఎండలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లకు దాత రచ్చ కామేశ్వరరావు చల్లని పానీయం అందించారు.

'మద్యం నుంచి ప్రజలు దూరంగా ఉండాలి'

ప్రత్తిపాడు, జనవరి 18: మద్యం నుంచి ప్రజలు, యువత దూరంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మనారాయణ చెప్పారు. మండలంలోని ఏలూరు గ్రామంలో వారం పాటు ఏలూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు సభకు లక్ష్మీనారాయణ విచ్చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం వల్ల ఆరోగ్య దెబ్బతినడంతో పాటు నగదు కూడా కోల్పోతున్నామని ఈ మహమ్మారికి ప్రతి ఒక్కరు దూరం కావాలన్నారు. గ్రామాల్లో మద్యం షాపులు లేకుండా మహిళలు చూడాలన్నారు. సమావేశంలో ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామస్తులున్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో వెలుగులు'

తుని రూరల్, జనవరి 18: టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అందరి జీవితాల్లో వెలుగు నింపుతాయని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. తుని రూరల్ జిల్లేడుపాడు గ్రామంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమం చేపట్టారు. వైసీపీ అరాచక పాలనను వివరిస్తూ టీడీపీ మేనిఫెస్టో పత్రాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని, తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలందరికీ అండగా ఉంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

'కులగణన పూర్తి చేయాలి'

కరప, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీవో కె.అప్పారావు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో ఏర్పాటు చేసిన కులగణన సర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, టీవోటీలు జి.దుర్గాభవానీ, ఎస్కే నాగేంద్రకుమార్, పి.శ్రీనివాస్, ఎం.చక్రపాణి పాల్గొన్నారు.

22న అన్నవరంలో భారీ ఊరేగింపు

అన్నవరం, జనవరి 18: ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని ఆ రోజు అన్నవరంలో అన్ని వర్గాల ప్రజలతో భారీ ఊరేగింపు చేపట్టాలని నిర్ణయించారు. గురువారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో వివిధ కుల సంఘాల పెద్దలు సమావేశమయ్యారు. ఈనెల 22న ఉదయం స్థానిక తారకరామ కాలనీ రామాలయం నుంచి ర్యాలీ ప్రారంభించి సాక్షిగణతి ఆలయం, సత్యదేవుడి తొలిపావంచా, వాసవీమాత ఆలయం మీదుగా వెలంపేట మరిడమ్మగుడి, రామాలయం చేరుకుని అక్కడ నుంచి తిరిగి సత్యదేవుడి తొలిపావంచా వద్ద ముగించాలని నిర్ణయించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వారణాసి రాంబాబు, పోచినపెద్ది రాదాకృష్ణ, దాసరి నగేష్, ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

22న శ్రీరామా రక్షాస్తోత్రం పూజలు

సామర్లకోట, జనవరి 18: సామర్లకోట కంచి మహాసంస్థానంలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం పదాల చెంతన ఈనెల 22న సీతారామచంద్రస్వామికి శ్రీరామా రక్షాస్తోత్రం నామపారాయణ పూజలు సాయంత్రం 4 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు మహాసంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి వెల్లడించారు. శ్రీరామ రక్షాస్తోత్ర నామపారాయణ, విష్ణుసహస్ర నామపారాయణ, హనుమాన్ ఛాలీసా పారాయణ, సామూహిక రామనామ సంకీర్తనలు నిర్వహించనున్నందున అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులుకావాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత గురజనాపల్లి

కరప, జనవరి 18: సంక్రాంతిని పురష్కరించుకుని కరప హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో గురజనాపల్లి జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌లో గురజనాపల్లి, కరప జట్లు ఫైనల్స్‌కు చేరగా గురువారం తుది పోరు జరిగింది. బహుమతి ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. రంజీ ప్లేయర్, సీఏకే అధ్యక్షుడు దేవు మధువీరేష్ తన తండ్రి దేవు సూరిబాబు జ్ఞాపకార్థం రూ.2లక్షలతో చేయించిన గోల్డ్‌కప్ రోలింగ్ ట్రోఫీని గురజనాపల్లి జట్టుకు కన్నబాబు, చిక్కాల అందజేశారు. బోగిరెడ్డి వెంకటేశ్వరరావు, పేపకాయల వరప్రసాద్‌ల స్మారక ట్రోఫీలను విజేత, రన్నర్‌గా నిలిచిన జట్లకు అందజేశారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, కార్పొరేటర్ వడ్డి మణికుమార్ పాల్గొన్నారు.



విజేత గురజనాపల్లి జట్టుకు గోల్డ్ రోలింగ్ కప్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, చిక్కాల

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

కత్తితో దాడి

కరప, జనవరి 18: పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపరిచిన ఘటన నడకుదురులో జరిగింది. కరప ఎస్ఐ టి.రామకృష్ణ సమాచారం మేరకు.. స్థానిక జగనన్న వాటర్ ప్లాంట్ వెనుక బుధవారం రాత్రి మర్రి గిరీష్‌కుమార్, అతడి స్నేహితులు కొల్లు రామ్మోహన్, యండమూరు అశోక్ మద్యం తాగారు. వందే రాంబాబు అక్కడకు వెళ్లి గిరీష్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగాడు. రాంబాబు కత్తితో గిరీష్‌కుమార్‌పై దాడిచేసి గాయపర్చాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

రెండోరోజు పట్టు రైతుల ఆందోళన

గొల్లప్రోలు రూరల్, జనవరి 18: ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్ వద్ద పట్టు రైతులు, రీలర్లు నిర్వహిస్తున్న ఆందోళన రెండోరోజుకి చేరింది. తక్షణం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. తక్షణం బకాయిలు విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఓరుగంటి ఈశ్వరుడు తదితరులు హెచ్చరించారు. 2రోజుల్లో ఇన్సెంటివ్ సొమ్ములు ఇస్తామని చెప్పిన అధికారులు 6నెలలు గడిచినా ఇవ్వకుండా రైతులను మోసగించారని మండిపడ్డారు. అసలు బకాయిలు ఎప్పుడు ఇస్తారో ఎవ్వరు చెప్పడం లేదని మండిపడ్డారు. ఆందోళనలో పట్టు రైతులు, రీలర్లు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు అభినందన

ప్రత్తిపాడు, జనవరి 18: ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురం సర్పంచ్ వీరంరెడ్డి నాగభార్గవి దంతవైద్యంలో బీడీఎస్ డిగ్రీ పూర్తయిన సందర్భంగా గురువారం ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ సర్పంచ్ అభినందించారు. సర్పంచ్‌గా ప్రజలు, గ్రామాభివృద్ధికి సేవలందించిడం, బీడీఎస్ డిగ్రీ పట్టా పొందడం అభినందనీయమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూది బూరయ్య, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సెలర్లు బొదిరెడ్డి గోపి, మూదినారాయణ స్వామి, నాయకులు బస్వా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వస్త్రాల అందజేత

గండేపల్లి, జనవరి 18: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో లియో క్లబ్ ఆధ్వర్యంలో పాత వస్త్రాలను సేకరించి అనాథ శరణాలయాలకు అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలకు వాడిన మందుల్లో మిగిలిన వాటిని సేకరించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు పంపిణీ చేస్తారు. 25 బస్తాల పాతవస్త్రాలను కాకినాడ, విశాఖపట్నంలో ఉన్న కృపా ఫౌండేషన్‌కు అందజేశారు. డీన్ సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేష్, మెకానికల్ విభాగ ప్రొఫెసర్ బీహెచ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కిర్లంపూడి, జనవరి 18: తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. సారిస సత్యానందం, పల్లెకల సుబ్బారావు, సరిసే సంతోష్, పేపకాయల గంగాధర్, నీటిపల్లి సతీష్, పల్లికల సంజయ్‌కిరణ్, వీర్రాజు, సూరిబాబు, నీటిపల్లి నాగదేవి, బర్రే శైలజ, పిలా నాగవరలక్ష్మి ఉన్నారు.



ఏపీలోనూ అధికారం సాధించడమే లక్ష్యం

కేంద్ర మంత్రి మహేంద్ర ముంజుపార


శంఖవరం మండలం కత్తిపూడిలో గ్యాస్‌కిట్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి

పిఠాపురం, జనవరి 18: కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారం సాధించాలనే లక్ష్యంతో బీజేపీ అడుగులు వేస్తున్నదని కేంద్ర శిశు సంక్షేమశాఖ, ఆయుష్ మంత్రి మహేంద్ర ముంజుపార తెలిపారు. పిఠాపురంలోని మంగాయమ్మరావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని సూచించారు. మోదీ తీసుకున్న పలు చర్యలతో ప్రపంచవ్యాప్తంగా భారత ఖ్యాతి విస్తరించిందని తెలిపారు. బీజేపీలో చేరిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, బుర్రి మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌కిట్ల పంపిణీ

శంఖవరం: మోదీ ప్రభుత్వంలో దేశంలో పేదలందరికీ పూర్తిస్థాయిలో సంక్షేమం అందుతుందని కేంద్రమంత్రి మహేంద్ర మంజూపార అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కత్తిపూడిలో ఆయన పేదలకు ఉచిత గ్యాస్‌కిట్లను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు విద్యావైద్యం మరింత అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గంటా బాలుదొర, వేటుకూరి సూర్యనారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు చిలుకరి రామ్‌కుమార్, సింగిల్‌దేవి సత్తిరాజు, అదట్రా వెంకన్నదొర, ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ కొల్లు సత్యనారాయణ ఉన్నారు.

జగన్ రూపాయి ఇచ్చి వంద లాక్కుంటున్నాడు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ


చేబ్రోలులో కరపత్రాలు పంచుతున్న వర్మ

గొల్లప్రోలు రూరల్, జనవరి 18: సంక్షేమ పథకాల పేరుతో సీఎం జగన్ ప్రజలకు రూపాయి ఇచ్చి వివిధ మార్గాల్లో పన్నులు, ధరల బాదుడు ద్వారా వంద రూపాయిలు లాక్కుంటున్నాడని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటిని గడపలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ ఎక్కడా కనబడని వైసీపీ ప్రజాప్రతినిధులు నేడు ప్రజలు ముందుకు వస్తున్నారని, మళ్లీ ఎన్నికలు రావడంతోనే వారికి ప్రజానీకం కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలను గాలికి వదిలివేసిన ఈ నాయకులు స్థానికేతరులు కావడంతోనే ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. తాను స్థానికుడనని, 2007 నుంచి ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, శ్రీనివాస్, బాబూరావు, వినయ్‌నాయుడు, బాబి, వీరబాబు పాల్గొన్నారు.

'మద్యపానాన్ని నిషేధించాలి'


చిత్రాడలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి దృశ్యం

పిఠాపురం రూరల్, జనవరి 18: మద్యపానాన్ని సంపూర్ణంగా నిషేధించడమే మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు అర్పించే నివాళి అని మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పిఠాపురం మండలం చిత్రాడ రామాలయం వద్ద గురువారం ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రామస్తులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా కాకుండా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆలోచించి మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏ.సూరిబాబు, బి.శివ, దొంగబాబు, ప్రకాశరావు, తాతారావు, వెంకటరావు, రాంబాబు, బుజ్జి, వెంకన్న, వీరబాబు, దుర్గబాబు, సతీష్ పాల్గొన్నారు.